క్లుప్తంగా

పశువుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: రైతులు, పాడి పశువుల యజమానులు పశువుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని వెటర్నరీ ఏడీ వసంతలక్ష్మి సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో పశువుల్లో ముద్ద చర్మవ్యాధి నివారణకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 31 వరకు కార్యక్రమం ఉంటుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నవధాన్యాల సాగుతో అధిక దిగుబడి



రైతులతో మాట్లడుతున్న ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు

బనగానపల్లె: రైతులు నవధాన్యాల సాగు చేయడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనువాసులు అన్నారు. మండలంలోని గోవిందిన్నె గ్రామంలో నవధాన్యాలు సాగు చేసిన పొలాలను బుధవారం సందర్శించారు. ఆయన మాట్లడుతూ..పంట మార్పిడి చేయడం వల్ల దిగుబడి పెరుగుతుందన్నారు. రైతులు నవధాన్యాల సాగు వైపు ఆసక్తి చూపాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో లాభాలు వచ్చే అవకాశాలు ఉంటాయని చెప్పారు. అడిషినల్ డీవీఎం సలాం, జిల్లా ఎన్ఎఫ్ఏ మార్కెటింగ్ రవీంద్ర ఆచారి పాల్గొన్నారు.

కొనసాగిన ఆర్టీసీ కార్మికుల ధర్నా



డిపో ప్రాంగణంలో ధర్నా చేస్తున్న కార్మికులు

బనగానపల్లె: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ రవి కిశోర్ ఏకపక్ష వైఖరికి నిరసనగా నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో అధ్యక్షుడు పి.జమ్ములయ్య,రీజినల్ చైర్మన్ కోటేశ్వర్ ఆధ్వర్యంలో డిపో ప్రాంగణంలో బుధవారం రెండవ రోజు ఆర్టీసీ కార్మికులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి ధర్నా కార్యక్రమం చేపట్టారు. యూనియన్ నాయకులు మాట్లడుతూ..డీఎం ఏకపక్షంగా తన కోటరిలోనున్న ఒక ఏడీసీని మాత్రమే సఫలింగ్ చేయడంపై నిరసన వ్యక్తం చేశారు. గ్యారేజ్‌లో మెకానిక్‌లకు, స్టోర్‌లో అసిస్టెంట్లను కేటాయించాలని కోరారు. బస్టాండ్‌లో రెగ్యులర్ కంట్రోలర్ ఏర్పాటు చేయాలని, ప్రయాణికులు, విద్యార్థులకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలని సూచించారు. డిపో కార్యదర్శి శ్రీనువాసులు,రీజినల్ మెంబర్ వలి,గ్యారేజ్ కార్యదర్శి దేవేంద్రర్ రెడ్డి,గ్యారేజ్ ప్రెసిడెంట్ గఫార్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

డోన్ టౌన్: రైతులు పంటల సాగులో యజమాన్య పద్ధతులు పాటించే విధంగా వ్యవసాయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ ధనలక్ష్మి సూచించారు. బుధవారం డోన్ డివిజన్‌లోని వ్యవసాయశాఖ క్షేత్ర సిబ్బందికి ఖరీఫ్‌లో వర్షాధారమైన వేరుశనగ, కంది, ఆముదం తదితర పంటల్లో అనువైన రకాలు, పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల, కలుపు మొక్కల, చీడ పురుగుల నివారణలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు సుధాకర్, బాలరాజు, రవిగౌడ్ పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ కమిటీ సమావేశం

డోన్ టౌన్: త్వరలో ప్రారంభమయ్యే వినాయక చవితి ఉత్సవాలపై గణేష్ ఉత్సవ కమిటీ సమావేశాన్ని బుధవారం స్థానిక వినాయకగుడిలో నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సభ్యులు సందు రమణ, ఫణిరాజ్, హనుమంతరెడ్డి, ఆంజనేయులగౌడ్, చక్రీ, ఈశ్వర్ నాయుడు, ఉషాలక్ష్మి, తిమ్మారెడ్డి, శంకర్‌రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

సంతాపం

డోన్ టౌన్: నంద్యాల ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న డోన్ పట్టణానికి చెందిన కానిస్టేబుల్ మహబూబ్ బాషా(52) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న డోన్ డీఎస్పీ శ్రీనివాసులు.. కానిస్టేబుల్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం పోలీసులాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో నంద్యాల ట్రాఫిక్ సీఐ మల్లికార్జున, ఏఆర్ పోలీలసులు ఉన్నారు.



కోవెలకుంట్లలో కురుస్తున్న మోస్తరు వర్షం



గుంజలపాడు సమీపంలో సాగైన మొక్కజొన్న

ఊరించి..ఉసూరుమనిపించి!

- కరుణించిన వరుణుడు
- చిన్నపాటి వర్షానికే పరిమితం
- వాడుతున్న పైర్లు
- పంటల సాగుకు దాటుతున్న అదును

కోవెలకుంట్ల: ఖరీఫ్ ప్రారంభానికి ముందు వర్షాలు ఆశాజనకంగా కురిసినా సీజన్ ప్రారంభమయ్యాక వరణుడు ముఖం చాటేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం సాయంత్రం స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు మండలాల్లో వరణుడు ఊరించి ఉసూరుమనిపించాడు. ఆకాశంలో నీలి మేఘాలు కమ్ముకోవడంతో భారీ వర్షం కురుస్తుందని రైతులు భావించారు. అయితే చిన్నపాటి వర్షం కురవడంతో దిగాలు చెందుతున్నారు. సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 24,915 హెక్టార్లలో వరి, పత్తి, మినుము, కంది, పెసర, ఆముదం, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, ఉల్లి, సోయాబీన్ తదితర పంటలు సాగు చేయాల్సి ఉంది. జూన్ 1 నుంచి ఖరీఫ్ ప్రారంభం కాగా ఆయా మండలాల పరిధిలో ఇప్పటి వరకు 2,572 హెక్టార్లలో మొక్కజొన్న, 1,399 హెక్టార్లలో మినుము, 196 హెక్టార్లలో పత్తి, 114 హెక్టార్లలో కూరగాయలు, 35 హెక్టార్లలో కంది, మరో 52 హెక్టార్లలో ఇతర పంటలు మాత్రమే సాగు చేయగలిగారు.

విత్తనం వేసినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో వర్షం కురవకపోవడంతో సాగు చేసిన పంటల్లో ఎదుగుదల నిలిచిపోయి వాడుముఖం పట్టాయి. మిగిలిన పంటల సాగుకు అదును దాటిపోతుండటంతో పంటల సాగు డీలా పడింది. మరో వారం రోజుల్లో పదునయ్యే వర్షం పడకపోతే పంటల సాగుకు అదును దాటిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒకే ఒక్కడు!

- 84 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు
- ఆయన సెలవు పెడితే సీఆర్‌పీనే గతి
- పట్టించుకోని విద్యాశాఖ అధికారి



ఉపాధ్యాయుడు లేకపోవడంతో బోధన చేస్తున్న సీఆర్‌పీ నాగమద్దయ్య



ఉపాధ్యాయుడు లేని 1, 2, 3 తరగతుల విద్యార్థులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఎం.పెండేకల్లు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతులకు కలిపి మొత్తం 84 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు బోధన సాగిస్తున్నారు. ఒక ప్రధానోపాధ్యాయుడు, ముగ్గురు ఉపాధ్యాయులకుపైగా ఉండాల్సిన పాఠశాలలో ఒక్కరే అది కూడా హెచ్‌ఎం బాధ్యతలు నిర్వర్తిస్తూ పాఠాలు చెబుతున్నారంటే విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం ఏపాటితో అర్థమవుతోంది. మండల కేంద్రానికి 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో బోధన కుంటుపడుతున్నా మండల విద్యాశాఖ అధికారి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గత ఏడాది వరకు ప్రాథమిక పాఠశాలగా ఉండగా ఇటీవలే ఆదర్శ పాఠశాగా అప్‌గ్రేడ్ చేశారు. ఈక్రమంలో ఆస్పరి నుంచి పీఎస్ హెచ్‌ఎంగా సుధాకర్ ఇక్కడికి వచ్చారు. ఆయనతోపాటు ఇద్దరు ఉపాధ్యాయులు డిప్యుటేషన్‌పై పని చేసేవారు. వారు కూడా ఇటీవల బదిలీ కావడంతో హెచ్‌ఎం మాత్రమే మిగిలారు. అయితే 50 శాతం ఉపాధ్యాయులు పాఠశాలలో ఉంటేనే బదిలీ అయిన వారిని రిలీవ్ చేయాలనే నిబంధనలు ఉన్నా ఎలా రిలీవ్ చేశారో విద్యాశాఖ అధికారికే తెలియాలి. సమీప పాఠశాలల నుంచి అయినా డిప్యుటేషన్ వేయాల్సి ఉన్నా కాలయాపన చేస్తుండటంతో విద్యా బోధన కుంటుపడుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

శిక్షణకు హెచ్‌ఎం.. సీఆర్‌పీనే గతి..

ఉన్న హెచ్‌ఎం సుధాకర్ కూడా సోమవారం నుంచి జిల్లా కేంద్రంలో జరుగుతున్న నాలుగు రోజుల లీడర్ షిప్పు ట్రెనింగ్‌కు వెళ్లారు. దీంతో సీఆర్‌పీ నాగమద్దయ్య టీచర్ అవతారం ఎత్తారు. క్లాస్‌లో ఉంటూ విద్యార్థులతో కాలయాపన చేయిస్తున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత విషయమై ఎంఈఓ సోమశేఖర్‌ను వివరణ కోరగా గతంలో బలపాలపల్లె, గోరుమానుకొండ పాఠశాలల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు డిప్యుటేషన్ వేశామని, వారు కూడా బదిలీ కావడంతో టైమ్ స్కేల్ ఉపాధ్యాయులను నియమించేందుకు యత్నిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఇది చెప్పి కూడా దాదాపు పదిరోజులవుతున్నా ఇంత వరకు చర్యలు శూన్యం.

అక్రమ కేసులకు భయపడొద్దు



వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

అవుకు: అక్రమ కేసులకు ఎవరూ భయపడొద్దని, కాలం అన్నింటికీ సమాధానం చెబుతుందని వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి అన్నారు. మే 15న శ్రీ భూలక్ష్మీ సమేత చెన్న కేశవ స్వామి తిరుకల్యాణోత్సవాల్లో జరిగిన రథోత్సవ సమయంలో వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డితో పాటు మరి కొందరు కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించిన విషయం తెలిసిందే. కేసులో భాగంగా కొందరు జైలుకు వెళ్లివచ్చారు. ఈ నేపథ్యంలో అక్రమ కేసుల బాధితులు గంగాధర్, రామ మద్దిలేటి, రమణయ్య, మహేష్ నాయక్, జాయ్, షంషీర్, వెంకటేష్, మనోహర్, కంబ గిరిస్వామిని బుధవారం వారి స్వగృహాలకు వెళ్లి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు కేవలం కక్ష సాధింపుల కోసమే పుణ్య కార్య విషయంలో అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. గతంలో ఇక్కడ ఇలాంటి కక్ష సాధింపులు ఎన్నడూ జరగలేదన్నారు. గ్రామం మొత్తం అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉండేవారని గుర్తు చేశారు. కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసానిచ్చారు.

రైల్వే స్టేషన్‌ను సందర్శించిన రైల్వే జోనల్ మెంబర్



రైల్వే జోనల్ మెంబర్‌కు వినతి పత్రం ఇస్తున్న బేతంచెర్ల వాసులు

బేతంచెర్ల: పట్టణంలోని రైల్వే స్టేషన్‌ను రైల్వే జోనల్ మెంబర్ వెంకటరంగయ్య బుధవారం సందర్శించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. ప్రయాణికులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బేతంచెర్ల రైల్వే స్టేషన్‌లో కరోనాకు ముందు ఆగుతున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని, రెండో ప్లాట్‌ఫారంలో సౌకర్యాలు లేవని, బనగానపల్లె రైల్వే గేట్‌లో ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని పారిశ్రామికవేత్తలు గుండా గోపాలు, మారుతి శర్మ, విజయ నాగరాజు, బీజేపీ నాయకులు నాగ మోహన్, రమణ, కౌశిక్ వినతి పత్రం అందజేశారు. సమస్యలను నంద్యాల ఎంపీ ద్వారా జోనల్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. అలాగే గుంతకల్లు నుంచి అమరావతి వరకు ఇంటర్ సిటీ రైలు ఏర్పాటు ప్రతిపాదన ఉందన్నారు.

19న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

అవుకు: ఈనెల 19వ తేదీన స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి మండల సమావేశం నిర్వహించనున్నారని పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి బుధవారం తెలిపారు. బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తారని చెప్పారు. ఇందుకు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

20న కోవెలకుంట్ల, సంజామలలో..

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గంలోని కోవెలకుంట్ల, సంజామల మండలాల్లో ఈనెల 20వ తేదీన వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి మండల సమావేశాలు ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ ఆయా మండలాల అధ్యక్షులు బీవీ నాగార్జునరెడ్డి, మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ బాబు షూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం కోవెలకుంట్లలో, మధ్యాహ్నం సంజామల మండలం గిద్దలూరు ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలకు ఆయా మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల కన్వీనర్లు, సభ్యులు పెద్ద హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

డోన్ టౌన్: మధ్యవర్తిత్వంతో కేసులను సత్వరమే పరిష్కరించుకోవచ్చని డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు శీలం భాస్కర్ నాయుడు, నల్లమేకల మద్దయ్య సూచించారు. మధ్యవర్తిత్వంపై బుధవారం స్థానిక కోర్టు భవనాల సముదాయం వద్ద నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, కోశాధికారి శ్రీనివాసులు న్యాయవాదులు వేణుగోపాల్ గౌడ్, శివరామకృష్ణ, కృష్ణమూర్తి, మనోహర్, వంశీకృష్ణ, రవిమోహన్ పాల్గొన్నారు.

అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలి

డోన్ టౌన్: యర్రగుంట్ల గ్రామంలోని రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిని నిర్మించాలని గ్రామస్తులు బుధవారం బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్‌రెడ్డికి విన్నవించారు. గ్రామంలో రైల్వే గేటు ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ కూడా రాలేకపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఆయన ఎంపీ, ఎమ్మెల్యేకు ఫోన్ ద్వారా సమస్యను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరినాయుడు, రామచంద్రనాయుడు, ముదిరాజ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

టీబీ వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం

డోన్ టౌన్: టీబీ వ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞకరూ కృషి చేయాలని టీబీ సూపర్‌వైజర్లు కరీంముల్లా, అరుణ్ కోరారు. బుధవారం పట్టణ సమీపంలోని కోట్లవారిపల్లిలో ఇండస్ట్రీయల్ ఏరియాలో కార్మికులకు టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. జ్వరం, దగ్గు వారానికంటే ఎక్కువ రోజులు ఉంటే వెంటనే గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. టీబీ నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడితే నయమవుతుందన్నారు.

నీటి ట్యాంక్‌కు దారి లేక ఇబ్బందులు



వాటర్‌ట్యాంక్ వద్దకు వెళ్లే దారిలో అడ్డంగా ఉంచిన ఎద్దుల బండి

సంజామల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. మండలంలోని రెడ్డిపల్లె గ్రామంలో 10 వేల లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంక్‌కు వెళ్లే మార్గాన్ని ఆక్రమించడంతో కోట వీధి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంక్ పరిసర ప్రాంతాల్లోని టీడీపీ కార్యకర్తల కుటుంబాలు దారిని ఆక్రమించి ట్రాక్టర్‌లు, ఎద్దుల బండ్లు, వ్యవసాయ పనిముట్లు, రాళ్లు అక్కడే ఉంచారు. దీంతో ట్యాంక్ వద్దకు వెళ్లే మార్గం పూర్తిగా మూసుకుపోయింది. నీటి కోసం ట్యాంక్ వద్దకు వెళ్లే కాలనీ వాసులకు అవస్థలు తప్పడం లేదు. అధికారులు స్పందించి ట్యాంక్ వద్దకు వెళ్లేందుకు దారి కల్పించాలని కోరుతున్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

కోవెలకుంట్ల: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ ప్రకాష్‌నాయుడు అన్నారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, క్లాప్ మిత్రలతో నమస్తే కార్యక్రమం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ ప్రజలు ఇళ్లలోని చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను కాల్వల్లో పడేయకుండా ఇళ్ల వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందజేయాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు అండర్ డ్రైనేజీ, సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేసే క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు సన్మానించారు.

నేటి నుంచి గ్రామసభలు

కొలిమిగుండ్ల: పీ-4పై గ్రామ సభలు ప్రారంభిస్తామని ఎంపీడీఓ ప్రసాదరెడ్డి బుధవారం తెలిపారు. 17వ తేదీన అంకిరెడ్డిపల్లె, బి.ఉప్పలూరు, 18న తిమ్మనాయినపేట, తోళ్లమడుగు, తుమ్మలపెంట,19న నందిపాడు, కొలిమిగుండ్ల, 22న పెట్నికోట, గొర్విమానుపల్లెలో జరుగుతాయన్నారు. మండల స్థాయి అధికారులు గ్రామ సభల్లో పాల్గొంటారని చెప్పారు. ఆదర్శ కుటుంబాలుగా ఎంపికైన వారిని బంగారు కుటుంబాలుగా దత్తత తీసుకుంటారని వెల్లడించారు.

19న స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్

డోన్ టౌన్: ఈనెల 19న స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు.

సింగిల్ విండో చైర్మన్‌గా ఉన్నం చంద్రశేఖర్

బేతంచెర్ల: మండల సింగిల్ విండో చైర్మన్‌గా ఉన్నం చంద్రశేఖర్, డైరక్టర్లుగా రాధకృష్ణ, హనుమంత్ రెడ్డితో సీఈఓ ఓబులేష్ బుధవారం ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి హాజరై నూతన చైర్మన్, డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: రామకృష్ణాపురం ఫీడర్ పరిధిలోని గార్లదిన్నె, మాధవరం, రామకృష్ణాపురం గ్రామాల్లో గురు, శుక్రవారాలు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ వినయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఫీడర్ నిర్మాణ పనులు చేపడుతున్న కారణంగా ఆయా రోజుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కేసు నమోదు

డోన్ టౌన్: పట్టణంలోని చిగురమానుపేటలో బుధవారం చోటు చేసుకున్న ఘర్షణలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. బాధితులు సంపత్‌కుమార్, లోకేష్ ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్యాపిలి: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ కాంతారావు నాయక్ ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీని బుధవారం ఆయన సందర్శించారు. ఎన్‌సీడీసీడీ సర్వే వారంలోగా పూర్తి చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న విద్యార్థుల నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆయన సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను సందర్శించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాహుల్ పాల్గొన్నారు.

21న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల బహిరంగ సభ

బేతంచెర్ల: విజయవాడలోని రామవరప్పాడు నుంచి విద్యుత్ సౌధ వరకు ఈనెల 21 జరిగే విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని కాంట్రాక్ట్ కార్మికులు సుబ్బయ్య, మల్లేష్ కోరారు. బుధవారం వారు విద్యుత్ కార్యాలయ వద్ద మాట్లాడుతూ 30 ఏళ్లుగా చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్నామని, సమాన పనికి సమాన వేతనంతోపాటు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని చేపట్టిన బహిరంగ సభకు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

సర్పంచ్ ఔదార్యం



రోడ్డును ప్రారంభిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: మండలంలోని లింగాల గ్రామ సర్పంచ్ యేర్వ సంజమ్మ గ్రామాభివృద్ధికి సొంత నిధులు వెచ్చించి తమ ఔదార్యం చాటారు. రూ. 2.50 లక్షలతో నిర్మించిన అభివృద్ధి పనులకు బుధవారం ప్రారంభోత్సవం చేశారు. గ్రామ శివారులోని మినరల్ వాటర్ ప్లాంట్ నుంచి ప్రాథమిక పాఠశాల వరకు రహదారి సౌకర్యం లేక విద్యార్థులు, ఆ మార్గం ద్వారా వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లకు నిధుల కేటాయింపులో పక్షపాతం చూపిస్తుండటంతో గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలనే సంకల్పంతో సమస్యలను అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న తన కుమారుడు యేర్వ రమణారెడ్డికి తెలియజేసింది. దీంతో ఆయన ఇటీవల గ్రామానికి చేరుకున్నాడు. గ్రావెల్‌రోడ్డు నిర్మాణానికి రూ. 1.50 లక్షలు, సోమేశ్వరస్వామి దేవాలయం, రామాలయంలో అభివృద్ధి పనులకు రూ.లక్ష కేటాయించారు. పనులు పూర్తి చేసి అభివృద్ధి పనులకు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యేర్వ వెంగళరెడ్డి, యేర్వ శేషిరెడ్డి, రాంపుల్లారెడ్డి, చంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, దండె రమణారెడ్డి, శంకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, ప్రసాదరెడ్డి, బైరెడ్డి సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నుసి వెంగళరెడ్డి, బైరెడ్డి శేషిరెడ్డి, దండె శీలారెడ్డి, ప్రహల్లాదరెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

- రూ.1.75 లక్షల ఎరువులు,మందులు సీజ్



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు



ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ కలిమున్నీసా

డోన్ టౌన్: పట్టణంలోని మారుతి ఫర్టిలైజర్స్, మల్లికార్జున ట్రేడర్స్, గురుదత్త, విజయ స్టోర్స్‌లలో బుధవారం రాష్ట్ర ప్రత్యేక అధికారి గుంటూరు కమిషనరేట్ వ్యవసాయ ఉప సంచాలకులు ప్రసాద్, విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు తనిఖీలు నిర్వహించారు. నిషేధిత మందులు, నాణ్యత లేని విత్తనాలను గుర్తించి రూ.1.75.202 లక్షల విలువైన ఎరువులు, పురుగు మందుల విక్రయాలను నిలిపేశారు. డోన్ వ్యవసాయ అధికారులకు మిగిలిన దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డోన్ ఏడీఏ సునిత, ఏఓ శ్రీనివాసరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ ఉదయ్ కుమార్, వ్యవసాయ విస్తరణాధికారులు మధు పాల్గొన్నారు. కాగా తనిఖీల విషయం తెలుసుకున్న మిగతా దుకాణాలను మూసివేసి నిర్వాహకులు వెళ్లిపోయారు.

యూరియా అధిక ధరలకు అమ్మితే చర్యలు

అవుకు: యూరియా అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి కలిమున్నీసా హెచ్చరించారు. స్థానిక కిరణ్ ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో బుధవారం తనిఖీలు చేపట్టారు. దుకాణంలోని స్టాక్ రిజిష్టర్‌లతో పాటు, గోడౌన్‌లోని ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. దాడుల్లో 1,170 యూరియా, 570 కాంప్లెక్స్ ఎరువుల బ్యాగులకు ఇన్వాయిస్, సరైన స్టాక్ రిజిష్టర్ లేకపోవడంతో వాటి అమ్మకాలను తాత్కాలికంగా నిలిపి వేయాలని దుకాణాదారుడికి ఆదేశాలు జారీ చేశారు.



జేసీబీతో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని వెలగటూరు రస్తాలోని జుర్రేరువాగు సమీపంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను అధికారులు బుధవారం తొలగించారు. మండలంలోని వెలగటూరు టీడీపీ నేతకు చెందిన మినరల్ వాటర్ ప్లాంట్‌కు చెందిన ప్లాస్టిక్ వ్యర్థాలను జుర్రేరు వాగు సమీపంలో పడేసి నిప్పటించారు. ఆ పొగతో కాలుష్యమేర్పడి చిన్నపిల్లల ఆరోగ్యానికి హానీ కలుగుతుందని భావించిన పట్టణానికి చెందిన టీడీపీ నేత ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చి వేయడాన్ని ఖండించారు. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంపై బుధవారం సాక్షి దినపత్రికలో 'టీడీపీ నేతల మధ్య ప్లాస్టిక్ వార్' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. ఈ మేరకు మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ ప్రకాష్‌నాయుడు స్పందించారు. జేసీబీ సాయంతో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే పనులు చేయించారు. ఈఓ మాట్లాడుతూ ఈ ప్రదేశంలో చెత్త, చెదారం, ఇతర వ్యర్థాలను వేసే వారికి నోటీసులు ఇచ్చి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.